మండిపోతోంది. "హోసి ఇడియట్ - నిచ్చెన తిరగేసి వేశావే - ఏదీ మళ్ళీ ఎక్కు....నేను పట్టుగుంటాను. ఇందాక ఎల్లా పడ్డావో చూపించు" అన్నారు. "ఆల్‌రైట్ నిచ్చెన పట్టుకోండి" మళ్ళీ ఎక్కాను. పండుకోసి "ఇదుగోనండీ" అని వెనక్కు తిరిగి చూపించబోయాను. మళ్లీ చీర కాళ్ళకడ్డం పడింది. పడ్డాను. పడ్డం పడ్డం నిచ్చెన పట్టుగున్న శ్రీవారిమీద తాటిపండులా పడ్డాను. "చచ్చాన్" అన్నారు. స్త్రీలు పైకి వెళ్ల గూడదన్నారు గదా- యిప్పుడెలాగుంది? అన్నాను "వెలాసిటీ ఎక్కువగా వుందే" అన్నారు. స్త్రీల వెలాసిటీ ఎక్కువగానే వుంటుంది. భూదేవి కూడా స్త్రీయే కదా. స్త్రీదేవీ భూదేవీ కలుసుకునప్పుడు ఆ మాత్రం వెలాసిటీ వుండదా - "మీకేం ఫిజిక్సు తెలీదు. సైన్సూ తెలీదు" అన్నాను. ఇప్పుడిప్పుడే తెలుస్తోంది అన్నారు. దట్సాల్!

మా ఇంట్లో బొప్పాయి చెట్టూ లేదు. నిచ్చెనా లేదు. నేను సిమెంటు కుండీలోనూ పడలేదు. బొప్పాయి పండంటే నాకు చలా అసయ్యం. వూరిఖే రాశాను. స్త్రీల వెలాసిటీ తెలుసుకుని పురుషులు జాగ్రత్తపడడం అవసరమని - మెట్ల ఫిలాసఫీ కొద్దిగా రుచిచూస్తారనీ - మరేమోనె బొప్పాయి చెట్టు ఎక్కాలంటే ముందు క్రింద సిమెంటుకుండీ తీయించేయాలి నిచ్చెన తలక్రిందులుగా వేయకూడదు. బొప్పాయి పండు కోశాక "ఇదిగో నండీ" అని వెనక్కి తిరిగి నవ్వకూడదు. పళ్ళు రాలిపోయేలా క్రింద పడతారు. క్రింద పడితే ఫరవాలేదు. మీకెపాసిటీకి మీ వారు అణగారి పోతారు. మీ యింట్లో బొప్పాయి చెట్టు నిచ్చెనా రెండూ వుంటే ఏదో ఒకటి అమ్మేసెయ్యండి. ఎది అమ్ముతారు? బొప్పాయి చెట్టా? బలేవారే! నిచ్చెనే అమ్మేసెయ్యండి. (నిచ్చెనంటే ఏంబిషన్) ఏంబిషన్ లేకుండా ఎంత మంది జీవించటం లేదు. బైదిబై మీ ఇంట్లో బొప్పాయి చెట్టు ఉందా - లేదూ బ్రతికిపొయ్యారు. అయితే నిచ్చెన లేదా? నిచ్చెన ఎప్పుడూ ఎరువు తీసుకోకండి. ఎవరింటికేనా వెళ్ళి నిచ్చెన ఎక్కడం కంటె మనింట్లో వున్న నూతిలోకి దూకటం మంచిది. నా మాటలు మీకు బోధపడటం లేదా? ఇదంతా ప్యూర్‌ఫిలాసఫీ. ఫిలాసఫీ ఎప్పుడేనా ఎవడికేనా తిన్నగా బోధపడి ఏడిచిందా? లేదు. లేదు. అది అంతే - అది యాబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్.... యాబ్‌స్ట్రాక్ట్ రైటింగ్ మీకు బోధ పడ్డం లేదా ఓరమ్మ నేనేం జేతునే-ఓరయ్య నేనేంజేతునే...

# ప్రణయ వల్లకి పల్లకి....

**నా** చిన్నప్పుడు ఎక్కడకు వెళ్ళాల్సి వచ్చినా ఒంటెద్దు బండిమీద ప్రయాణాలు చేసే వాళ్ళం. మా వాళ్ళు పడవ ప్రయాణాలు కూడా చేసేవారు రాదారిబోటు అని వుండేది. అందులో చెక్క గదులుండేవి ఘోసా స్త్రీలు పడవ ప్రయాణం చేసేటప్పుడు ఆ చెక్కగదులకు తెరలు కట్టుకునే వారు. అందులోనే వంటా, భోజనాలు కూడా చేసేవారు. పడవ టాపుమీద

కొందరూ, పడవలోపల కొందరూ ప్రయాణం చేసేవారు. పడవకి సరంగులుండేవారు. పడవల గుమాస్తాలు కూడా వుండేవారు. వాలు కెదురుగా ప్రయాణం చేసేటప్పుడు కళాసీలు తాడుతో పడవను "హైలెస్సో హైలెస్సా" అని లాగేవారు.

పడవకు వెనక చుక్కానీ వద్ద ఒకకుర్రాడ్నో, ఒక ఆడదాన్నో కూచోపెట్టేవారు. చుక్కాని తిప్పితే పడవ నీటి మధ్యకుగాని, ఒడ్డుకుగాని వచ్చి చేరేది పడవ పాటలు కూడా మనకివుండేవి. కాలవలో కాని, నదిలో కాని నీరు సరిగా లేకపోతే పడవ ఇసుకలో యిరుక్కుపోయేది. పడవ మేట వేసింది అనేవారు. పడవ అంచులమీద గడవేస్తూ యిటూ అటూ కళాసీలు బారుచేసి జోరు చేసేవారు. గాలివాలును చూసుకుని తెర చాపలు ఎత్తేవారు. పడవల్లో కూడా రాత్రిపూట చిల్లర దొంగతనాలు జరిగేవి. పడవ చార్జీని కేవ్ అనేవారు. పడవలాగే కళాసీలు తమాషా పాటలు పాడేవారు.

"ఆవకాయ చద్దివణ్ణం జుర్రో జుర్రో
దాని మొగుడు దాన్ని కొడితే కుయ్యో మొర్రో
కుయ్యో మొర్రో! జుర్రో జుర్రో!

ఈ పాటల్లో ఒకటో రెండో చరణాలుండేవి. అవే మళ్ళీ మళ్ళీ పాడేవారు. అర్థం పర్థం, అక్కర్లేదు. కొంచెం బూతు కూడా కలిసి పోయేది.

"ఎర్రా ఎర్రని దానా ఎత్తూ పిర్రల దానా" అనే పదాలు మళ్లీ మళ్లీ పాడుకుంటూ శరీర శ్రమని మర్చిపోతూ పడవలాగేవారు కళాసీలు.

ఇప్పుడు జీవితం మారిపోయింది. రాదారి పడవలు లేవు. ఆ సరంగులు లేరు. ఆ పాటలు, ఆ సాహిత్యం కాలగర్భంలో కలిసి పోయాయి. ప్రయాణ సాధనాలు మారాయి. ప్రజల జీవితాల్లో చాలా మార్పు వచ్చింది. ఇంకా మన దేశంలో చాలా మంది కాలినడకని ఆశ్రయించినప్పటికీ ఏ మాత్రం అవకాశమున్నా ఏదో ఒక ప్రయాణ సాధనాన్ని తప్పక వినియోగిస్తున్నారు.

తెలుగు దేశంలో సంపన్న కుటుంబీకులు అగ్రవర్ణస్థులు మేనాల నుపయోగించేవారు. గొప్పింటి స్త్రీలు మేనాలలో ప్రయాణం చేసేవారు. బోయిలు "భోం భోం" అంటూ భుజాలు మార్చుకుంటూ మోసేవారు. ఈ పల్లకీలలో తాసీల్దారులు, ఉద్యోగస్థులు కూడా పల్లకీల మీద వచ్చే వారు. పెళ్లిళ్లకు ముత్యాల పల్లకీలు వాడేవారు. పల్లకీ లేకుండా పెళ్లి ఊరేగింపుకి అందంరాదు. పల్లకీలో కుచ్చులుండేవి. ఇటూ అటూ ఒరగ కుండా ఆ కుచ్చులు పట్టుకునే వాళ్ళం. పల్లకీల వెనుక కావిళ్ళు నడిచేవి. అంపకాలప్పుడు పెళ్ళికూతురికి పెట్టిన సారె అంతా కావిళ్ళమీద వూరికంతా చూపించేలా మడతలు విప్పి కావిడిమీద వ్రేలాడేసి వీధి వీధినా తిప్పి మరీ తీసుకువెళ్ళేవారు. మా వాళ్ళు సముద్దార్లుగను చరస్తిదార్లుగానూ పనిచేసేవారు. కమానుకి వెళ్లాల్సొచ్చినపుడు గుర్రాలమీద వెళ్లేవారు. పెంకి గుర్రాలు కొన్ని అడవిలో తుప్పల్లోకి తోసేస్తూండేవి. ముళ్ళలో పడిపోతూండేవారు. ఏజన్సీ అడవుల్లోనూ, కొండల్లోనూ గుర్రాలమీదే వెళ్ళేవారు. ఇది ఏనాటి సంగతో అనుకునేరు. ఒక పాతికేళ్ల క్రితం ముప్పయ్యేళ్ళ క్రితం మన

గ్రామాలు యిలానే వుండేవి. తరవాత్తరవాత ఒంటెద్దుబళ్లు, ఎద్దుబండి ప్రయాణాలు వచ్చాయి. రెండెడ్ల బండి అప్పుడూ వుంది. యిప్పుడూ వుంది. ఒంటెద్దుబళ్లు యిప్పుడు ఎక్కడోగాని కనిపించటంలేదు. బండివాడి పాటలని కొలంబియా గ్రామఫోను రికార్డులు కూడా వచ్చాయి, "ఓరోరి బండివాడా – వగలమారి బండివాడా" అనేపాట విన్నట్టు గుర్తు. ఈ ఎద్దు బండ్లకు ఏదో ఓ మాదిరి రోడ్డంటూ వుండాలి. అక్కడక్కడా రోడ్డుపడ్డాకే ఎద్దుబండ్ల ప్రయాణం పాప్యులరైంది. తరువాత జటకా బళ్ళొచ్చాయి. జటకాబండి వేగానికి చిహ్నం. గుర్రం గుర్రమే. ఎద్దు ఎద్దు మొద్దు స్వరూపమే. జట్కా రేటు కూడా ఎద్దుబండి రేటు కంటే హెచ్చు. చాలామంది మోతుబర్లకు స్వంత జట్కాలుండేవి. స్కూళ్ళ యినస్పెక్టర్లకు క్యాంపులకు వెళ్ళటానికి సొంత ఎద్దుబండ్లు వుండేవి. అందులో చాప పరుపు, దిళ్లూ – మరచెంబు యింకా కాగితాల పెట్టి అన్నీ పెట్టుకుని ప్రయాణాలు చేసేవారు.

ఇంకా జట్కాబళ్లున్నాయి. బస్సులొచ్చాక ప్రయాణాల్లోచాలా మార్పు వచ్చింది. బస్సు డ్రయివర్లు, క్లీనర్లూ కండక్టర్లూ గొప్ప హీరోలైపోయారు. అప్పుడే కాబోలు 'బస్సు పుట్టిందొరోయి బాబు బస్సు పుట్టిందీ. బస్సుపుట్టి బళ్ళవాళ్ళ కడుపు కొట్టిందీ' అనే రికార్డొచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో మన దేశంలో కూడా రిక్షాలొచ్చాయి అప్పుడు మనుష్యులు లాగేవే విరివిగా వుండేవి. మొదట్లో రిక్షా ఎక్కిన వారిని చూసి రోడ్డుమీద జనంనవ్వుకునేవారు. అనంతశయనం ఎక్కావురా అని వెక్కిరించేవారు రిక్షా వీధిలో వెడుతూంటే అడవాళ్లు గుమ్మాల దగ్గర నిలబడి విస్తుపోయేవారు. అలాటిది క్రమంగా అలవాటుపడ్డారు. మనుష్యులు కూర్చుంటే మనిషిని మనిషంతవాడు లాగటం సబబేనని అంగీకరించారు. రైళ్ళు వున్నప్పటికీ అవి అందరికీ అందుబాటులో లేవు. మారుమూల గ్రామాల నుంచి బళ్ళు కట్టుకుని వచ్చి బస్సెక్కి రైలుస్టేషను వున్న వూరుచేరి రైలు ప్రయాణాలు చేయాల్సి వచ్చేది. ఇప్పటికి కూడా ఈ పరిస్థితి వుంది. కాని చాలా చోట్ల రోడ్లుపడి బస్సులు తిరుగుతున్నాయి. మన జీవితాల్లో చాలా మార్పు తెచ్చిన గొప్ప వాహనం సైకిలు. సైకిళ్ళొచ్చాక వూళ్ళో తిరగటానికి చిన్న చిన్న ప్రయాణాలు చేయటానికి, పనులు చక్కబెట్టుకొనటానికి గొప్ప సౌకర్యం కలిగింది. సైకిల్ కేవలం మధ్య తరగతికి సంకేతం మాత్రమే కాదు. ఇప్పుడందరూ విరివిగా వాడుతున్నారు. నోట్లో సిగరెట్టూ, చేతిలోసైకిలూ లేని స్టూడెంటుండడు గదా, ఇన్ని ప్రయాణ సౌకర్యాలొచ్చాక జీవితం మునుపటి కంటెఎక్కువ వేగాన్ని అందుకుంది. ఈ వేగం తాలూకు ప్రభావం మనం ఆలోచనలు, అభిప్రాయాలు, ఆశయాలమీద కూడా ప్రసరిస్తుంది. అంతెందుకు – మనం వాడుకునే భాష కూడా చాలా మారిపోతుంది. ప్రయాణాల్లో పరిభాష మీద బి.బి.సి. వారు మంచి ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు.

నేను బెనారెస్‌లో "ఎక్కాగాడి" ఢిల్లీలో "టాంగా"లు ఎక్కి ప్రయాణాలు చేశాను. కాని మన ఆంధ్రలో సైకిల్ రిక్షా యుగం యిది. మనకి ఆటోమొబైల్ ఏజ్ యిప్పుడిప్పుడే

అడుగుపెట్టినా యిది సైకిల్ యుగమని ఒప్పుకోవాలి. పడవలు, స్టీమర్లూ, లాంచీలు వున్నా మనం వాటిని ఎక్కువగా వుపయోగించటం లేదు. హైవేలు పెద్దపెద్ద వంతెనలు వెలిసాక నీటిమీద ప్రయాణాలు తగ్గిపోయాయి.

దూర ప్రయాణాలకు రైళ్లు బస్సులు విరివిగా వుపయోగిస్తున్నాము. పట్టణాలలో సిటీ బస్సులు తిరుగుతున్నాయి. ఈ సిటీ బస్సుల వలన రిక్షావాళ్లకు కొంచెం దెబ్బతగులుతోంది.

ఇప్పుడెవరూ గుర్రాలమీదా, ఒంటెలమీదా, ఎడ్లబండ్లమీదా ప్రయాణం చెయ్యటం లేదు. సైకిళ్ళు, రిక్షాలు, స్కూటర్లు వచ్చాయి. చిన్నకార్లూ, టాక్సీలు కూడా తిరుగుతున్నాయి. వీటి వలన మన జీవితంలో చాలా మార్పు వచ్చింది. తెలుగు పరిభాష కూడా చాలా మారిపోయింది. ఎన్నో కొత్త మాటలు ప్రయోగాలు వచ్చాయి. ప్రయాణాల పరిభాష గురించి ఎవరైనా రీసెర్చి చేస్తే బావుంటుంది. పల్లకీలు, మేనాలు, బోయిలూ, రాదారి పడవలూ కళాసీలూ యిప్పుడెక్కడున్నాయి? లేవు. స్త్రీలు స్కూటర్లూ, కార్లూ, విమానాలు నడుపుతున్నారు. ఆడపిల్లలు సైకిళ్లు తొక్కుతున్నారు. మన కుటుంబ జీవితంలో కూడా అలాగేచాలా మార్పులొచ్చాయి. ఏ గూటిచిలక ఆ గూటి పలుకు అని యిళ్ళలో పరిభాష కూడా చాలా మారిపోతోంది కాని నాబోటి దానికి చాలా పాత వాసనలు అలాగే వుండిపోయాయి కాబోలు. బస్సులో ప్రయాణం చేస్తే నాకు తిప్పుతుంది. చిన్నకారులో వెళ్తే వికారం పెడుతుంది. రైల్లో ప్రయాణం చేస్తూంటే ఏది పడితే అది తినబుద్ధి వెయ్యదు. ఇంట్లోంచి వీధిలో కెళ్ళినా అక్కడ హోటళ్ళలో ఫలహారాలు, కాఫీ టీలు, పుచ్చుకోవాలనిపించదు, గత్యంతరం లేకపోతే తప్ప. కాళ్ళూ చేతులూ కడుక్కోకుండా, స్నానం చేయకుండా ఏదీ తినబుద్ధికాదు. ఆసుపత్రికి వెళ్తే యింటికొచ్చి ఆ బట్టలు వదిలేసి స్నానం చేయనిదే వంటింట్లోకి రాబుద్ధిపుట్టదు. సినిమా కెళ్ళొచ్చినా వేసంకాలం స్నానంచేస్తేనే కాని నిద్ర పట్టదు. ఈ అలవాట్లన్నీ అస్థిగతమైపోయాయి. నాకు పల్లకీ అంటే చాలా యిష్టం. ఇప్పుడు నన్నెవరు పల్లకీలో కూచోపెడతారు? మా పెళ్ళికి మేం పల్లకీలోనే వూరేగాము. బ్యాండుమేళం పెట్టించలేదు, మంచి సన్నాయి మేళము. కృతులు, కీర్తనలూ, తరంగాలూ వాయించారు. మాయింట్లో మళ్ళీ పెళ్ళి ఏదైనా జరిగితే, పల్లకీ తెప్పిస్తాను. సన్నాయి మేళాలే పెట్టిస్తాను. గ్రామఫోను రికార్డులంటే నాకు చాలాకోపం – పెళ్లి కొడుకునూ పెళ్ళి కూతుర్నీ సైకిలు రిక్షాలో కూర్చోపెట్టి తిప్పితే నేనూరుకోను. పల్లకీ దొరక్కపోతే విక్టోరియా గుర్రపు పార్టయినా సరే కాని గుర్రం మాత్రం తెల్లగా వుండాలి. గుర్రం తోలేవాడు చెమికీ టోపీ పెట్టుకొనాలి. పెళ్ళిలో అంతా పంచెలు కట్టుకుని జరీకండువాలు వేసుకోవాలి, నేను గర్వపడే తెలుగు జీవితం నాకుంది. దాన్ని నేను ఎందుకు మర్చిపోవాలి? నా కప్పుడప్పుడు పల్లకిలో కూర్చుని వూరేగుతున్నట్లు కలొస్తుంది. అఫ్ కోర్స్ అలా రాకూడదట! వస్తే చాలా కీడు జరుగుతుందట. ఐ డోంట్ కేర్. ప్రణయ వల్లకి పల్లకి అన్నారు కదా గురూగారు.